క్లుప్తంగా

విద్యార్థులకు సన్మానం



చిన్నంబావి: ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆగస్టు 30 నుంచి ఈ నెల 1 వరకు సెకండ్ సౌత్ జోన్ టార్గెట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తృతీయ స్థానం కైవసం చేసుకుందని వివేకానంద పాఠశాల ప్రిన్సిపాల్ లింగస్వామి, పీఈటీ ఉమాశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులు యశ్వంత్, శంశా, యోగేషను వివేకానంద పాఠశాల యాజామాన్యం సన్మానించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని అంబ భవానీ ఆలయంలో నూతనంగా నిర్మిస్తున్న శిఖరం నిర్మాణ పనుల కోసం స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వంతు సహాయంగా రూ.6,600 విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్న సందర్భంగా దాతలు ముందుకు రావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంటన్నయాదవ్, వెంకటన్నగౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకటేష్, ఈశ్వర్, కురుమూర్తియాదవ్, భాస్కర్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

రుణమాఫీ దరఖాస్తులకు పోటెత్తిన రైతులు



పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో దరఖాస్తులు ఇచ్చేందుకు గురువారం రైతులు పోటెత్తారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు, అర్హత ఉన్నా రుణమాఫీ వర్తించని రైతులు దరఖాస్తులు అందజేసేందుకు పెద్ద సంఖ్యలో రైతువేదికకు చేరుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులు మండల కేంద్రంలోని రైతువేదికకే వస్తుండటంతో సందడిగా మారింది. ఏ క్లస్టర్ పరిధిలోని రైతులు ఆ క్లస్టర్ రైతువేదికలో దరఖాస్తులు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే ఇలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు వాపోతున్నారు.

కొర్లకుంటలో విష జ్వరాలు

వీపనగండ్ల: మండలంలోని కొర్లకుంటలో పలువురు విషజ్వరాల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. వరుసగా కురుస్తున్న ముసురు వర్షాల వల్ల గ్రామంలో సరైన పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం వల్లే విషజ్వరాలు సంభవిస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో మంగళి వెంకటస్వామి, లక్ష్మి, నరేష్, బుడ్డమ్మ, లక్ష్మీదేవమ్మ, కిరణ్ బాబుతో పాటు పలువురు విషజ్వరాలతో బాధపడుతున్నారన్నారు. ఈ విషయమై ఎంపీడీను వివరణ కోరగా.. శుక్రవారం వైద్యాధికారులను తీసుకెళ్లి గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తామని విషజ్వరాలు ఉన్నట్లు తేలితే వారికి అవసరమైన చికిత్సను అందిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులది 'గురు'తర బాధ్యత



వనపర్తిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, పుర చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తిటౌన్: ఉపాధ్యాయులది సమాజంలో గురుతర బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం దళితవాడ ఉన్నత పాఠశాలలోని 17 మంది ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. అదేవిధంగా బాలుర ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎం తారాబాయి ఆధ్వర్యంలో గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల జీహెచ్ఎం చంద్రశేఖర్, కౌన్సిలర్ సత్యమ్మ, కాంగ్రెస్ నాయకులు లక్కాకుల సతీష్, వెంకటేష్, ఎల్‌ఐసీ కృష్ణ, విభూతి నారాయణ, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణ సేవలు మరువలేనివి

ఉపాధ్యాయ స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం ప్రతి ఉపాధ్యాయుడికి, విద్యార్థి లోకానికి స్ఫూర్తిదాయకమని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర కన్వీనర్ రాజా రామ్‌ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, దేవన్న, బాలేమియా తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో..

ఆత్మకూర్: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్ది, దేశం గర్వించేస్థాయికి ఎదిగి వివిధ రంగాల్లో స్థిరపడేలా చేయడంలో ఉపాధ్యాయుల తోడ్పాటు అద్వితీయమని ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్ రెడ్డి, ఎంఈఓ భాస్కర్‌సింగ్ అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మూలమళ్ల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు విశ్వేశ్వర్, జమ్మన్న, రాఘవేందర్‌రావు, సునీల్‌రెడ్డి, శ్వేత, కురుమూర్తి, లలితమ్మ, వీణ, చైతన్యరాణి, హెచ్ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు మహేశ్వరమ్మ, ప్రభావతమ్మ, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు, విద్యార్థులు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెబ్బేరు పట్టణంలో పని చేసే ఉపాధ్యాయులు అరుంధతి, దుర్గాప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా.. వారిని పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, నరేందర్, కృషాకర్‌రెడ్డి, సహదేవుడు, ఈశ్వర్‌రెడ్డి, రాజనాయక్, శ్రీకాంత్ శాలువా, పూలమాలతో సన్మానించారు.

అమరచింత: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.



అమరచింతలో..



పెబ్బేరు చెంచు వాడ పాఠశాలలో..



ఆత్మకూర్ ప్రభుత్వ కళాశాలలో..



మూలమళ్లలో..

భరోసా కేంద్రాలతో బాధితులకు మనోధైర్యం



మాట్లాడుతున్న భరోసా కేంద్రం సభ్యులు

ఖిల్లాఘనపురం: లైంగిక వేధింపులు, అత్యాచారానికి గురైన బాలికలలకు మనోధైర్యాన్ని కలిగించేందుకు భరోసా సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సెంటర్ జిల్లా సపోర్ట్ పర్సన్ నాగలక్ష్మి తెలిపారు. వనపర్తి జిల్లా భరోసా సెంటర్ ఇన్‌చార్జ్ ఎస్ఐ అంజద్ సూచన మేరకు గురువారం ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో తరుచూ బాలికలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని చేరదీసి వారిలో మనోధైర్యం నింపేందుకు న్యాయసలహాలు అందించడంతో పాటుగా ఆరోగ్యం, ఆర్థిక చేయూత, జీవన నైపుణ్యంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. బాల్య వివాహాలు, ఆన్‌లైన్ మోసాలు, సెల్‌ఫోన్ల వల్ల కలిగే అనర్థాలు, ఆపద సమయంలో డయల్ 100 కు ఫోన్ చేయడం, మాదకద్రవ్యాల అలవాటు వలన కలిగే నష్టం తదితర విషయాలపై విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ప్రశాంతి, భరోసా సెంటర్ సపోర్టర్ కీర్తి, ఉపాధ్యాయులు పుష్పలత, పీఈటీ విజయలక్ష్మి, స్వరూప, కాత్యాయని, శారద, కవిత, సుగుణ, శివమణి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరులు అన్నిరంగాల్లో రాణించాలి



ఖిల్లాఘనపురంలో నూతన కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు భూమయ్య

ఖిల్లాఘనపురం: వడ్డెరులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ప్రతి కుటుంబంలోని చిన్నారులందరిని ఉన్నతంగా చదివించాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్ వద్ద మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖిల్లాఘనపురం మండల కమిటీని ఆయన ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా ఒర్సు యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా సంపంగి లోకయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా సంపంగి రాములు, వెంకట్రాములు, కోశాధికారిగా మల్లేష్, ప్రచార కార్యదర్శిగా నాగరాజు, మహిళా కన్వీనర్‌గా దాసర్ల శ్రీవల్లి, ఉపాధ్యక్షులుగా వెంటేష్, దాసర్ల శ్రీరాములు, జరుపటి రాజు, లోకయ్య తదితరులను నియమించారు.

మహిళ అదృశ్యం: కేసునమోదు

గోపాల్‌పేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మహిళ మిస్సింగ్ కేసు నమోదయిందని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జనిగ జానకి ఆగస్టు 26న కూలి పనికి వెళ్లి.. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద చూసినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం జానకి భర్త రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు. వివాహితకు ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

బస్సులు ఢీ: తప్పిన ప్రమాదం

వనపర్తి టౌన్: వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు బస్సులు ఢీకొనడంతో అద్దాలు ధ్వంసమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్లాట్‌ఫాంపై ఉన్న ఓ బస్సు దారి మళ్లించే క్రమంలో పక్కనే ఉన్న మరో బస్సుకు ఢీ కొట్టింది. దీంతో బస్సు ముందు అద్దాలు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు కాస్త ఆందోళనకు గురి కాగా.. ప్లాట్‌ఫాంపై ఉన్న పలువురికి అద్దాలు తగిలి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ప్రయాణికులను అక్కడ నుంచి దూరంగా పంపించారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ జయన్నను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

గోపాల్‌పేట: అతివేగంగా వచ్చిన ద్విచక్రవాహనం మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన రేవల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాము తెలిపిన వివరాల మేరకు.. ఏదుల గ్రామానికి చెందిన కేశవులు ఆయన కొడుకు మల్లేష్‌తో కలిసి గురువారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై నాగర్‌కర్నూల్ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. రేవల్లి పెట్రోల్‌బంకు వద్దకు వచ్చిన తర్వాత ఎదురుగా తల్పునూరు గ్రామానికి చెందిన యువకులు మరో ద్విచక్రవాహనంపై అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి కేశవులు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టారు. దీంతో కేశవులు గాయాలపాలయ్యాడు. కేశవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నిలిచిన తాగునీటి సరఫరా

అమరచింత: మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించేందుకు ఎర్రగట్టు వద్ద ఏర్పాటు చేసిన పంప్‌హౌజ్ సమీపంలో మిషన్ భగీరథ పైపు లీకేజీ కారణంగా 40 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. మూడు రోజుల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయినా సంబంధిత అధికారులు లీకేజీలకు మరమ్మతు చేపట్టని కారణంగా గ్రామాల్లో ప్రజలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో తాగునీటి కోసం సోర్సు బోర్లు సైతం మరమ్మతుల కారణంగా వాటిని వదిలేయడంతో ప్రజలకు తాగునీటికి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయలేకపోతున్నారు. అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో తాగునీటి పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని సోర్స్ బోర్లు సైతం మరమ్మతులు చేపట్టకపోవడంతో తాగునీటి ట్యాంకర్ల కోసం ప్రజలు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రామన్‌పాడ్ వద్ద 600 ఎంఎం ఎంఎస్ లైన్ పైప్ లీకేజీ మరమ్మతు పనులు జరుగుతున్నాయని త్వరితంగా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈ రుక్మేందర్‌రెడ్డి తెలిపారు.

వర్షంతో అన్నదాత కుదేలు



బొల్లారంలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు



తిప్పడంపల్లిలో వరిపంట పొలంలో మేట వేసిన ఇసుక

ఆత్మకూర్: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు కష్టాన్ని తెచ్చి పెట్టాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆత్మకూర్ మండలంలో వరి పంటలు నీట మునిగాయి. మండలంలోని మూలమళ్ల గ్రామంలోని జల్లాపురం కుంటచెరువుకు గండిపడడంతో సుమారు 20 ఎకరాలు వరి పంట, ఆరేపల్లిలో కృష్ణానది పరివాహక ప్రాంతంలో సాగుచేస్తున్న సుమారు 80 ఎకరాల వరిపంట నీట మునిగింది. తిప్పుడంపల్లిలోని ఊకచెట్టువాగు పరిసరాల్లోని సుమారు 50 ఎకరాలు వరిపంట వరద దాటికి కొట్టుకుపోయింది. దేవరపల్లిలో 20 ఎకరాలు, రేచింతలలో 40 ఎకరాలు, కత్తేపల్లిలో 25 ఎకరాలు, తూంపల్లిలో 30 ఎకరాలు వరి పంటలు నీట మునిగాయని రైతులు వాపోయారు. మండల వ్యాప్తంగా పర్యటించి ఇప్పటి వరకు 60 ఎకరాల్లో పంటలు నష్టం వాటిల్లినట్లు గుర్తించామని, పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పిస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్‌కుమార్ తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

వీపనగండ్ల: పంటలు, ఇళ్లు కోల్పోయి బాధితులుగా మిగిలిన వారికి తక్షణమే ఆర్థికసాయాన్ని అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొర్లకుంట, బొల్లారం గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను వారు పరిశీలించారు. బొల్లారం గ్రామ ఊర చెరువుకు వరద రావడంతో చెరువు కింద సాగు చేసిన పంటలను రైతులు కోల్పోయారని, అలాగే భీమా బీ 27 కాల్వ తెగిపోవడంతో పంట పొలాల్లో ఇసుక మేట వేసిందని, ఎకరాకు రూ.25వేల పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లాలో వరి, వేరుశనగ, ఆముదం, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయని రెవెన్యూ, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుర్మయ్య, చల్మారెడ్డి, సుజాత, వినోద్, యాదగిరి, గోవిందు, శివ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: ఏడు ఎకరాల పొలాన్ని లీజుకు తీసుకుని రూ.2 లక్షలు ఖర్చు చేసి మునగ పంట సాగు చేస్తే వర్షాల వల్ల తోట మొత్తం పాడైందని వీపనగండ్లకు చెందిన కౌలు రైతు మహేష్ ఆవేదన చెందారు. ప్రభుత్వ పరంగా తమను ఆదుకుని పరిహారాన్ని చెల్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఆరేపల్లిలో..



వీపనగండ్లలో పాడైన మునగ పంటను చూపుతున్న కౌలు రైతు మహేష్



మూలమళ్లలో..

పుర కమిషనర్‌ను సరెండర్ చేయాలని తీర్మానం



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

వనపర్తిటౌన్: మున్సిపల్ కమిషనర్ పూర్ణ చందర్‌ను సీడీఎంఏకు సరెండర్ చేయాలని కౌన్సిల్‌లో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం మున్సిపల్ చైర్మన్ మహేష్ అధ్యక్షతన పుర సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ కమిషనర్‌కు ఏ సమాచారం కోసం ఫోన్ చేసినా స్పందించడం లేదని ఆరోపించగా.. వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ కమిషనర్‌ను సరెండర్ చేద్దామని ప్రతిపాదించారు. ఈ మేరకు సభ్యులంతా సమ్మతి తెలపడంతో అధికారికంగా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎప్పుడు కార్యాలయానికి వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో తెలియడం లేదని, ఎక్కడున్నారని ఎవ్వరూ అడిగిన కలెక్టరేట్ వద్ద సమీక్షలో ఉన్నారని ప్రతిసారి చెప్పడం పరిపాటిగా మారిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిధులు మంజూరు చేయడం లేదు..

అంతకుముందు సభ ప్రారంభం కాగానే కార్యాలయ ఫర్నీచర్‌కు రూ.8లక్షలు ఎలా కేటాయిస్తారని, వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు చేసేందుకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని బీఆర్ఎస్ సభ్యులు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, లక్ష్మీనారాయణ, బండారు కృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు మిగతా బీఆర్ఎస్ కౌన్సిలర్లు భారతి, నూర్జత్ ఉన్నీసాబేగం, కంచె రవి, కోఆప్షన్ సభ్యులు గులాం ఖాదర్ ఖాన్, ఇమ్రాన్ తదితరులతో కలిసి సమావేశాన్ని బహిష్కరించారు. ఈ క్రమంలో ప్రతిపక్ష, అధికార పార్టీల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో నిధుల దుర్వినియోగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న అధికార పక్షం తీరును వ్యతిరేకిస్తూ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రకటించారు. అధికారులతో పని చేయించుకోవాలి తప్పితే ప్రతి ఒక్కరిని సరెండర్ చేస్తూపోతే ఎలా అని నిలదీశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మహేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో బీఆర్ఎస్ పాలకపెద్దలు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

గోపాల్‌పేట: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్స్ స్కీం ప్రోగ్రాం డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ పలు రకాలుగా సోకుతుందని, కలుషితమైన సిరంజీలు వాడటం, హెచ్ఐవీ సోకిన వ్యక్తితో లైంగిక సంబంధం పెట్టుకోవడం, హెచ్ఐవీ సోకిన వ్యక్తి రక్తం తీసుకోవడం వల్ల హెచ్ఐవీ సోకుతుందన్నారు. ఒకవేళ తల్లికి హెచ్ఐవీ ఉన్నట్లయితే ఆస్పత్రికి క్రమం తప్పకుండా వెళ్లి పరీక్షలు చేయించుకుంటే పుట్టబోయే బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా డాక్టర్లు జాగ్రత్తలు చెబుతారన్నారు. అనంతరం క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ రక్త పరీక్షలు చేసుకుని హెచ్ఐవీ ఉందోలేదో తెలుసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ సోకిన వ్యక్తిని తాకితే హెచ్ఐవీ వస్తుందని భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వీరమణి, ప్రవీణ, షబానా, లక్ష్మి, వైఆర్‌కే కేర్ సంస్థ సూపర్‌వైజర్ రామకృష్ణ, సీఎల్‌డబ్ల్యూ శివాని తదితరులు పాల్గొన్నారు.

పొల్కిచెరువు అలుగు పరిశీలన



పాన్‌గల్ పొల్కి చెరువు అలుగును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ అధికారులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని పొల్కి చెరువు అలుగును గురువారం నీటి పారుదల శాఖ అధికారులు పరిశీలించారు. భారీ వర్షాలకు చెరువు అలుగు పారుతుండటంతో చెరువులోకి వరద నీరు ఎంత వరకు వస్తుంది, అలుగు ద్వారా బయటకు నీరు ఎంతవరకు పోతుంది అనే విషయాలతో పాటు చెరువు కట్టకు ఏమైనా ప్రమాదం ఉందా అనే విషయాలను అధికారులు అంచనా వేశారు. దీంతో పాటు వెంగళాయిపల్లి సమీపంలో కేఎల్ఐ కాల్వలో పేరుకపోయిన షీల్టును తొలగించే పనులు కూడా పరిశీలించారు. కాల్వలో పేరుకుపోయిన షీల్టు తొలగించి చివరి ఆయకట్టుకు సాగునీటి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ మధుసూదన్‌రావు, డీఈ వెంకటరమణ దేవి, గిరిధర్‌రావు పాల్గొన్నారు.

'పంట నష్టం వివరాలివ్వండి'



పాన్‌గల్ మండలం దావాజిపల్లిలో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



రాయిణిపేట శివారులో నీట మునిగిన ఆముదం పంటను పరిశీలిస్తున్న ఏఈఓ రవీందర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మండలంలోని రాయిణిపేట శివారులో గల రాజసముద్రం చెరువు పూర్తిగా నిండటంతో సమీప పంట పొలాలు నీట మునిగాయి. దీంతో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్‌రెడ్డి గురువారం రాయిణిపేట శివారులో నీట మునిగిన పంటలను పరిశీలించి రైతుల, పంట వివరాలు నమోదు చేశారు. పంట నష్టం, వేరుశనగ, వరి చేను, పత్తితో పాటు ఇతర పంటలు ఏఏ రైతు ఎన్ని ఎకరాల పంట నష్టం జరిగింది అనే వివరాలతో కూడిన పూర్తి నివేదికను జిల్లా అధికారులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంపత్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వంతరెడ్డి, చెన్నయ్య, గోవిందు, బాలరాజు తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: మండలంలోని దావాజిపల్లి, శాగాపూర్ గ్రామాల్లో నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారు.. సాగు చేసిన పంటల్లో ఎంత మేరకు నష్టం వాటిల్లిందనే విషయాలను ఆయా గ్రామాల్లో పర్యటించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. పంటలు నష్టపోయిన రైతులు వారి క్లస్టర్ పరిధిలో ఉండే ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో సేకరించిన పంట నష్టం వివరాలను జిల్లా అధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ సాజీద్‌రహమాన్, ఏఈఓలు శైలజ, అఖిల పాల్గొన్నారు.

జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్‌పై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి, అమరగిరి గ్రామాల్లో ఐటీడీఏ ఏపీఓ యాదమ్మ ప్రధానమంత్రి జన జాతీయ ఆదివాసీ న్యాయ అభియాన్‌పై చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకం ద్వారా చెంచు గూడెంలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారన్నారు. ఆదిమజాతి గిరిజన తెగల జీవితాలను మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రూ. 24వేల కోట్ల నిధులు సమకూరుస్తుందన్నారు.

పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ రోగుల ఇబ్బందులను తొలగించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు వీరపాగ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మండల పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించి, స్థానికంగా సమస్యలపై డాక్టర్‌తో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీకి బోరు మోటార్ మరమ్మతుకు నోచుకోకపోవడంతో రెండు నెలల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసంపూర్తి ప్రహరీని పూర్తి చేయాలని కోరారు. దీంతో పాటు మండలంలోని చాలా గ్రామాల్లో డెంగీ వ్యాపిస్తుండటంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు అశోక్, శిరాజ్, మైబూష్, రాము పాల్గొన్నారు.